

5

మైనర్లతో అసభ్య కంటెంట్ చేస్తే కేసులే

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 189 శుక్రవారం17 అక్టోబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# 50 శాతానికి మించొద్దు

## బీసీ రిజర్వేషన్లు... సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురు





- స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత
- 50 శాతం పరిమితి దాటవద్దని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లవచ్చని ప్రభుత్వానికి సూచన
- హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున జోక్యం చేసుకోలేమని వెల్లడి

**అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రిజర్వేషన్లు 50 శాతం పరిమితికి లోబడే ఉండాలని స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను కొట్టివేసింది. అవసరమైతే పాత రిజర్వేషన్ల విధానంతోనే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని ప్రభుత్వానికి సూచించింది. వివరాల్లోకి వెళితే, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు గతంలో స్టే విధించింది. ఈ స్టేను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. మిగతాది 2లో...

# మా దేశ ప్రయోజనాలే మాకు ముఖ్యం

- రష్యా చమురుపై ట్రంప్ వ్యాఖ్యలకు భారత్ కౌంటర్
- రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని ట్రంప్ వెల్లడి
- ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన భారత విదేశాంగ శాఖ
- ఇంధన భద్రత, ధరల స్థిరత్వమే తమ లక్ష్యమని వెల్లడి



విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్

**అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను నిలిపివేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తనకు హామీ ఇచ్చారంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం స్పందించింది. దేశ ఇంధన భద్రత, వినియోగదారుల ప్రయోజనాలే తమకు అత్యంత ప్రాధాన్యమని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇంధన దిగుమతుల విషయంలో తమ విధానాలు పూర్తిగా దేశీయ అవసరాల మేరకే ఉంటాయని పేర్కొంది.ఎన్డీటీవీ కథనం ప్రకారం, "రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ ఆపేస్తుందని ప్రధాని మోదీ నాకు హామీ ఇచ్చారు. ఇది వెంటనే జరగకపోయినా, ఆ ప్రక్రియ త్వరలోనే ముగుస్తుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. మిగతాది 2లో...

# గుజరాత్ మంత్రుల సంచలన నిర్ణయం

## కేబినేట్ మొత్తం రాజీనామా - నేడు కొత్త కేబినేట్ ప్రమాణం




అహ్మదాబాద**అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** గుజరాత్ రాష్ట్ర క్యాబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. గుజరాత్ కేబినెట్‌లోని మంత్రులంతా గురువారం రాజీనామా చేశారు. సీఎం భూపేంద్ర పటేల్ మినహా మిగిలిన 16మంది మంత్రులంతా తమ పదవులకు గుడ్ బై చెప్పారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేయాలని నిర్ణయించడంతో మంత్రులంతా రాజీనామా చేయాల్సి వచ్చిందిమిగతాది 2లో...

# మరో 170 మంది

## మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

- ఛత్తీస్‌ఘడ్‌లో లొంగిన 170మంది మావోలు
- లొంగిన వారిలో వాసుదేవరావు తదితరులు
- ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా



న్యూఢిల్లీ,**అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):**మావోయిస్టులకు వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. మిగతాది 2లో...

# వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చే మెసేజ్‌లను చూసి మోసపోవద్దు






- కేంద్ర ప్రభుత్వ పథకాల పేరిట సైబర్ మోసాలు
- : తెలంగాణ పోలీసుల హెచ్చరిక
- వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చే మెసేజ్‌లను చూసి మోసపోవద్దని హెచ్చరిక
- అర్హత చెక్ చేసుకోవాలంటూ పంపించే లింక్స్‌పై త్వరపడి క్లిక్ చేయవద్దని సూచన
- అపరిచితులు పంపించే లింక్స్, మెసేజ్‌లకు స్పందించవద్దన్న తెలంగాణ పోలీసులు

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత



- 'స్థానికం'పై రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం
- బీసీ రిజర్వేషన్లపై న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాతే
- ఖరీఫ్‌లో పండించిన ప్రతి గింజనూ కొంటాం
- మద్దతు ధరతోపాటే సన్నాలకు రూ.500 బోనస్
- మెట్రో ఫేజ్-2పై సీఎస్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ
- రాష్ట్రంలో మరో మూడు కొత్త వ్యవసాయ కళాశాలలు
- రూ.10,547 కోట్లతో హ్యామ్ రోడ్లు
- రక్షణ శాఖకు 435 ఎకరాల భూ కేటాయింపు
- డిసెంబరు ఒకటి నుంచి ప్రజా పాలన విజయోత్సవాలు : రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి
- 23న మరోసారి భేటీకి నిర్ణయం



# డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ప్రగతి పరుగులు

## ఏపీకి అండగా ఉంటాం :చంద్రబాబు, పవన్ విజన్ అద్భుతం..: ప్రధాని మోదీ



- కర్నూలు జిల్లా నన్నూరులో ప్రధాని మోదీ భారీ బహిరంగ సభ
- రూ.13,429 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు వర్చువల్ శ్రీకారం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో శరవేగంగా అభివృద్ధి అని వెల్లడి
- చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని కొనియాడిన ప్రధాని
- వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ఏపీ కీలక భాగస్వామి అని ప్రశంస
- రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని హామీ

**కర్నూలుఅక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పనిచేయడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూపంలో రాష్ట్రానికి శక్తిమంతమైన నాయకత్వం లభించిందని, ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ పాలనలో గత 16 నెలలుగా మిగతాది 2లో...

# మీడియా ముందుకు వెళ్లకండి..

## కూర్చుని మాట్లాడుకుందాం : కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

- ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని మంత్రికి మీనాక్షి సూచన
- సిమెంట్ కంపెనీల యాజమాన్యాలను సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్ బెదిరించినట్లు ఆరోపణలు
- దీంతో ఓఎస్డీగా సుమంత్‌ను తప్పించిన ప్రభుత్వం



# 50 శాతానికి మించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించి, శాస్త్రీయంగానే రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించామని, దీనిపై అసెంబ్లీలో కూడా అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని కోర్టుకు వివరించారు.

అయితే, రిజర్వేషన్లు 50 శాతం మించరాదని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన కృష్ణమూర్తి తీర్పు స్పష్టంగా చెబుతోందని ప్రతివాదుల తరఫు న్యాయవాది బలంగా వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో విచారణ కొనసాగుతున్నందున తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఈ దశలో పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేమని పేర్కొంటూ కొట్టివేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా ఈ కేసులో విచారణను కొనసాగించాలని హైకోర్టుకు సూచించింది.సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మళ్లీ ఉత్కంఠ నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. త్వరలో జరగనున్న కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# మా ప్రయోజనాలే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశం కావడంతో భారత విదేశాంగ శాఖ దీనిపై అధికారికంగా స్పందించింది.విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక ప్రకటన విడుదల చేస్తూ, "భారత్ భారీ మొత్తంలో చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటుంది. అంతర్జాతీయంగా ఇంధన ధరల్లో ఒడిదొడుకులు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయ వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే మా ప్రథమ ప్రాధాన్యత. మా దిగుమతి విధానాలు పూర్తిగా ఈ లక్ష్యం ఆధారంగానే ఉంటాయి" అని వివరించారు."స్థిరమైన ఇంధన ధరలు, సరఫరాల భద్రత అనేవి మా ఇంధన విధానంలోని రెండు ప్రధాన లక్ష్యాలు. దీనికోసం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఇంధన వనరులను విస్తృతం చేసుకుంటున్నాం" అని ఆయన తెలిపారు. ఇక అమెరికా విషయానికొస్తే, చాలా ఏళ్లుగా ఆ దేశం నుంచి ఇంధన సేకరణను పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని, గత దశాబ్ద కాలంలో ఇది క్రమంగా పెరిగిందని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం కూడా భారత్‌తో ఇంధన సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఆసక్తి చూపుతోందని, ఈ విషయంపై చర్చలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

# వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చే మెసేజ్‌లను చూసి మోసపోవద్దు

కేంద్ర ప్రభుత్వ పథకాల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్ గ్రూపులలో వచ్చే సందేశాలను చూసి మోసపోవద్దని, అర్హత కోసం లింక్‌లపై క్లిక్ చేసి మీ వ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దని సూచించారు. ప్రభుత్వ పథకాల కోసం అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వాట్సాప్ గ్రూపులలో సైబర్ నేరగాళ్లు ఫేక్ లింక్‌లను పంపి, కేంద్ర ప్రభుత్వ పథకాలు అందుబాటులో ఉన్నాయని నమ్మబలుకుతారని పేర్కొన్నారు. అర్హతను పరిశీలించుకోవాలని ఆశ చూపుతూ లింక్‌లను పంపుతారని, వాటిపై తొందరపడి క్లిక్ చేయవద్దని హెచ్చరించారు. అపరిచితులు పంపించే లింక్స్, సందేశాలకు స్పందించవద్దని సూచించారు.

# మీడియా ముందుకు వెళ్లకండి..

## కూర్చుని మాట్లాడుకుందాం

## : కొండా సురేఖకు మీనాక్షి నటరాజన్ ఫోన్!

హైదరాబాద్**అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):**

"మీడియా ముందుకు వెళ్లవద్దు. కూర్చుని మాట్లాడుకుందాం" అని తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ చేసి సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు రావాలని మంత్రికి నటరాజన్ సూచించారు.

కొండా సురేఖ ఓఎస్డీగా ఉన్న సుమంత్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించిన విషయం తెలిసిందే. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంట్ కంపెనీల యాజమాన్యాలను ఆయన బెదిరించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఆయనపై చర్యలు తీసుకున్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని కొండా సురేఖ ఇంటికి పోలీసులు వెళ్లారు. మాజీ ఓఎస్డీ సుమంత్ ఉన్నారనే సమాచారంతో మఫ్టీలో ఉన్న పోలీసులు అక్కడకి చేరుకున్నారు.

అయితే, కొండా సురేఖ కుమార్తె సుష్మిత పోలీసులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా సుష్మిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఇవన్నీ చేయిస్తున్నారని ఆరోపించారు. తన తల్లిదండ్రులనే లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖతో నటరాజన్ మాట్లాడినట్లు సమాచారం.

# గుజరాత్ మంత్రుల సంచలన నిర్ణయం

. (మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం కొత్త మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు 'గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మంత్రివర్గాన్ని శుక్రవారం మధ్యాహ్నం 12:39 గంటలకు విస్తరించనున్నారు' అని వెల్లడిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, మంత్రివర్గ విస్తరణలో భాగంగా సగం మంది వరకూ పాత మంత్రులే ఉండొచ్చని తెలుస్తోంది. అలాగే 10 మంది వరకూ కొత్త వారిని మంత్రులుగా తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ధర్మేంద్ర సిన్హ్, రిషికేశ్ పటేల్, ముఖేష్ పటేల్, భూపేంద్రసింగ్ చుడాసమా తిరిగి తమ మంత్రి పదవులను దక్కించుకునే అవకాశం ఉందని.. అలాగే కనుభాయ్ దేశాయ్, రాఘవ్జీ పటేల్, కున్వర్జీ బవలియా, మురుభాయి బెరా స్థానంలో కొత్త వారిని తీసుకునే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా, ప్రస్తుతం గుజరాత్ మంత్రివర్గంలో సీఎం పటేల్ సహా 17మంది మంత్రులు ఉన్నారు. ఎనిమిది మంది క్యాబినెట్ స్థాయి మంత్రులు కాగా.. మిగతా వారు సహాయ మంత్రులుగా ఉన్నారు. గుజరాత్ అసెంబ్లీలో మె?త్తం 182 మంది సభ్యులు ఉన్నారు. ఈ 182 మంది సభ్యులున్న అసెంబ్లీలో 27 మంది లేదా మొత్తం సభలో 15శాతం మంది మంత్రులు ఉండొచ్చు. మరోవైపు నూతన మంత్రివర్గ ప్రమాణస్వీకారానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరవుతారని భావిస్తున్నారు. ఈ మేరకు గురువారం నాటికి బీజేపీ ఎమ్మెల్యేలంతా గాంధీనగర్‌కు చేరుకోవాలని పార్టీ సైతం ఆదేశాలు జారీ చేసింది. అయితే, మంత్రి పదవులు ఎవరెవరికి దక్కుతాయనే అంశం ఇప్పుడు గుజరాత్ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ప్రగతి పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ అపూర్వ ప్రగతి సాధిస్తోందని ప్రశంసించారు. గురువారం కర్నూలు జిల్లా నన్నూరు వద్ద నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.



**రూ.13,429 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన, చేపట్టనున్న రూ.13,429 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. విద్యుత్, రైల్వే, జాతీయ రహదారులు, రక్షణ రంగాలకు చెందిన ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో కనెక్టివిటీని బలోపేతం చేస్తాయని, పరిశ్రమలకు ఊతమిచ్చి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని ఆయన వివరించారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టుల వల్ల కర్నూలుతో పాటు పరిసర ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

**చంద్రబాబు, పవన్‌లపై ప్రశంసల వర్షం**

రాష్ట్ర నాయకత్వంపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. "ఏపీలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారు. వారికి కేంద్ర ప్రభుత్వ పూర్తి సహకారం కూడా ఉంది. వీరి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళుతోంది" అని అన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలుగులో "సోదర సోదరీమణులకు నమస్కారం" అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ, అహోబిళం, మహానంది, మంత్రాలయం స్వాముల ఆశీస్సులు కోరుకుంటున్నట్లు తెలిపారు. తన జన్మస్థలమైన గుజరాత్‌లోని సోమనాథుడిని, కాశీ విశ్వనాథుడిని, శ్రీశైలం మల్లికార్జున స్వామిని స్మరించుకున్నారు.

**డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ప్రగతి పరుగులు**

ఢిల్లీ, అమరావతి కలిసి పనిచేస్తుండటంతో అభివృద్ధి వేగంగా సాగుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "గత 16 నెలల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ కారణంగా ఏపీ అనూహ్య ప్రగతి సాధిస్తోంది. 2047 నాటికి మన దేశం వికసిత భారత్‌గా మారాలన్న లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ తన వంతు కీలక సహకారం అందిస్తోంది. 21వ శతాబ్దం 140 కోట్ల భారతీయులది" అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలే ప్రాధాన్యంగా తమ ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని, అభివృద్ధే తమ విధానమని స్పష్టం చేశారు.

**రాయలసీమ అభివృద్ధికి పెద్దపీట**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే రాయలసీమ అభివృద్ధి చాలా ముఖ్యమని ప్రధాని నొక్కిచెప్పారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పలు ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఓర్వకల్లు, కొప్పర్తిలలో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక కారిడార్లు రాయలసీమ రూపురేఖలను మారుస్తాయని, ఇక్కడ పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు.

**పెట్టుబడులకు స్వర్గధామంగా ఏపీ**

ఆంధ్రప్రదేశ్, భారతదేశ అభివృద్ధిని ప్రపంచమంతా గమనిస్తోందని ప్రధాని అన్నారు. గూగుల్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఏపీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని గుర్తుచేశారు. "అమెరికా వెలుపల తమ అతిపెద్ద పెట్టుబడిని ఏపీలో పెడుతున్నట్లు గూగుల్ సీఈఓ స్వయంగా చెప్పారు. విశాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్, డేటా సెంటర్, సబ్-సీ కేబుల్ వంటి భారీ ప్రాజెక్టులు రాబోతున్నాయి. ఈ సబ్-సీ కేబుల్ వ్యవస్థకు విశాఖ గేట్‌వేగా మారనుంది" అని మోదీ తెలిపారు.

**ఇంధన రంగంలో ఏపీ కీలక పాత్ర**

దేశ ఇంధన భద్రతలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని కొనియాడారు. గతంలో దేశంలో విద్యుత్ సంక్షోభాలు ఉండేవని, ఇప్పుడు తమ ప్రభుత్వం క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తోందని అన్నారు. దేశంలో తలసరి విద్యుత్ వినియోగం 1400 యూనిట్లకు పెరిగిందని, ప్రతి ఇంటికి, పరిశ్రమకు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉందని చెప్పారు. చిత్తూరు ఎల్‌పీజీ బాట్లింగ్ ప్లాంట్ రోజుకు 20 వేల సిలిండర్లు నింపే సామర్థ్యంతో పనిచేస్తోందని, సహజవాయువు పైప్‌లైన్‌తో 15 లక్షల ఇళ్లకు గ్యాస్ సరఫరా అవుతుందని వివరించారు.

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

హైదరాబాద్**అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 'ఇద్దరు పిల్లల' నిబంధనను ఎత్తివేస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని తీర్మానించింది. ఖరీఫ్‌లో పండించిన ప్రతీ గింజనూ కొనాలనీ, సన్నాలకు మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. క్యాబినెట్ సమావేశం ముగిసిన అనంతరం సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. మరో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి ఆయన మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను వెల్లడించారు.

'కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా రాష్ట్రంలో రైతులు పండించిన పంటను కొనుగోలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఖరీఫ్ సీజన్‌లో కోటి 48 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశాం. ఇందులో 80 లక్షల మెట్రిక్ టన్నులను మిల్లింగ్ చేసి గోదాముల్లో నిల్వ చేస్తాం. అయితే ఇప్పుడున్న సామర్థ్యం ప్రకారం 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం ఉందని కేంద్రం తెలిపింది. అయినా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి వర్గం నిర్ణయించింది' అని పొంగులేటి తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై సుప్రీం కోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై క్యాబినెట్ చర్చించిందని ఆయన తెలిపారు. ఈ కేసును వాదించిన సీనియర్ న్యాయవాదులు, న్యాయ నిపుణుల సలహాలు, సూచనల మేరకు ముందుకు వెళ్లేందుకు మంత్రివర్గం నిర్ణయించిందని చెప్పారు.

రెండు రోజుల్లో న్యాయ నిపుణుల అభిప్రాయాలతో నివేదిక ఇవ్వాలని సీఎస్‌ను మంత్రివర్గం ఆదేశించిందని పేర్కొన్నారు. మెట్రో రైల్ ఫేజ్-1, ఫేజ్-2 ఏ, ఫేజ్-2 బీపై మంత్రి వర్గంలో సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. ఎల్అండ్‌టీకి చెల్లించాల్సిన మొత్తం ఫేజ్-2 నిర్మాణానికి కావాల్సిన నిధులు, కేంద్రం విధించిన షరతులు తదితర అంశాలపై చర్చించి నివేదిక సమర్పించేందుకు సీఎస్ నేతృత్వంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి మొదలగు ఉన్నతాధికారులతో కమిటీ వేయాలని క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. డిప్యూటీ సీఎం చైర్మెన్‌గా ఉన్న మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీకి అధికారుల కమిటీ నివేదిక అందిన తర్వాత మంత్రి వర్గంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆచార్య జయశంకర్ వర్సిటీకి అనుబంధంగా మరో మూడు కొత్త వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. నల్లగొండ జిల్లా హుజూర్‌నగర్, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ లో వాటిని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 1 నుంచి 9 వరకు ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందన్నారు. ఇందుకోసం మంత్రుల కమిటీని నియమించాలని తీర్మానించినట్టు తెలిపారు. రూ.10,547 కోట్లతో నిర్మించే 5,566 కిలోమీటర్ల హ్యామ్ రోడ్లకు త్వరలో టెండర్లు పిలవాలని మంత్రివర్గం లో నిర్ణయించామని అన్నారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి డెయిరీ ఫాం రోడ్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సంబంధించి రక్షణ శాఖ భూములు వినియోగించుకుంటున్న క్రమంలో ఆ శాఖకు ప్రత్యామ్నాయంగా 435.08 ఎకరాల భూములను అప్పగిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసిందన్నారు.

కృష్ణా-వికారాబాద్ బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి సంబంధించి 845 హెక్టార్ల భూ సేకరణకు అయ్యే రూ.438 కోట్ల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసిందని పొంగులేటి చెప్పారు. మన్ననూర్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మొత్తం వ్యయంలో మూడో వంతు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు అంగీకరిస్తూ క్యాబినెట్ తీర్మానించిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విభాగాలకు కావాల్సిన భూములను కేటాయించాలని నిర్ణయించామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఏన్కూర్ మార్కెట్ యార్డ్‌తో పాటు మరో ఏడెనిమిది విభాగాలకు భూములను అలాట్ చేసినట్టు తెలిపారు. నల్సార్ యూనివర్సిటీకి 7ఎకరాల భూమిని కేటాయించామనీ, గతంలో స్థానిక విద్యార్థులకు ఉన్న 25 శాతం రిజర్వేషన్లను 50 శాతానికి పెంచామని తెలిపారు.

**కొండా సురేఖ గైర్హాజరు**

క్యాబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ గైర్హాజరయ్యారు. తనకు తెలియకుండానే తన ప్రయివేట్ ఓఎస్టీని ఉద్యోగం నుంచి తొలగించడం, అతన్ని అరెస్ట్ చేసేందుకు తన ఇంటికి పోలీసులు రావడంపై ఆమె ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే క్యాబినెట్ భేటీకి రాలేదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే ఆమె రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ కారణంగా మంత్రివర్గానికి హాజరు కాలేకపోయారని అధికార వర్గాలు తెలిపాయి.

# మరో 170 మంది

ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. నిన్న ఛత్తీస్‌గఢ్‌లో 27మంది; మహారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 258 మంది లొంగిపోయారన్న అమిత్ షా.. నక్సలిజంపై పోరులో ఇదో పెద్ద విజయమన్నారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్ షా.. లొంగిపోయేవారిని స్వాగతిస్తామని.. ఇంకా తుపాకీతో ఉద్యమం కొనసాగించాలను కొనేవారు భద్రతా దళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగుతున్న వారు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు.

ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాంతాలుగా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని.. దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో భాజపా సర్కార్ ఏర్పాడిన తర్వాత జనవరి 2024 నుంచి 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1785మందిని అరెస్టు



చేశారని తెలిపారు. 477 మందిని భద్రతాదళాలు నిర్మూలించాయని తెలిపారు.

లొంగిపోయిన వారిలో సతీష్ అలియాస్ టి. వాసుదేవరావు సహా 10 మంది సీనియర్ మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం. లొంగిపోయిన వారి జాబితాలో రాణిత, భాస్కర్, నీలా అలియాస్ నందే, దీపక్ పాలో సహా పలువురు ఉన్నారు. వీరిలో వాసుదేవరావు తలపై రూ.కోటి రివార్డు ఉండగా.. మరికొందరిపై లక్షల్లో రివార్డులు ఉన్నట్లు తెలుస్తోంది.

# ఆహారం అందరి హక్కు..

**-సూరం సుధాకర్ రెడ్డి.**



**బయ్యారం/అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** గాలి,నీరు తర్వాత ఆహారం మూడవ అత్యంత ప్రాథమిక మానవ అవసరమని సూరం సుధాకర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెరుగైన జీవితం, మంచి భవిష్యత్తుకి ఆహార హక్కు అనే థీమ్ తో ప్రతి ఏడాది ప్రపంచ ఆహార దినోత్సవాన్ని అక్టోబర్ 16 నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించిందని,ప్రతి ఒక్కరికీ తగిన ఆహారం తీసుకునే హక్కు ఉందని,ప్రతి ఒక్కరికీ ఆహారం,జీవితం,స్వేచ్ఛ,పని,విద్య వంటి హక్కులు ఉండాల్సిందేనని అన్నారు.పోషణ, స్థోమత,అందుబాటు భద్రతతో కూడిన పోషక విలువలున్న ఆహారం అందరికీ అందాలన్నారు.జనాభా కంటే ఎక్కువ మందికి తగినంత ఆహారాన్ని రైతులు ఉత్పత్తి చేస్తున్నాప్పటికీ ఎంతోమంది ఆకలితో కటకటలాడుతున్నార న్నారు.వాతావరణ మార్పులు,సంఘర్షణలు,ఆర్థిక మాంద్యం,అసమానత,తదితర కారణాలతో ఎంతో మంది ఆకలితో బాధపడుతున్నారని ఎవరు కూడా ఆహారాన్ని వృధా చెయ్యొద్దని ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి ప్రజలకు సూచించారు.

# ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు జోనల్ స్థాయికి ఎంపిక

**-ఫిజికల్ డైరెక్టర్ బానోత్ వాలు.**





**బయ్యారం/ అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలలో ఈ నెల 14,15 తేదీల్లో బయ్యారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆటలను నిర్వహించినట్లు ఆశ్రమ పాఠశాల పిడి వాలు తెలిపారు.ఈ సందర్భంగా ఇరుస్లాపురం ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచరని,అండర్ 17 వాలీబాల్ పోటీలలో మొదటి స్థానం,అండర్ 14 వాలీబాల్ పోటీలలో మొదటి స్థానం,అండర్ 14 కబడ్డీ పోటీలలో ద్వితీయ స్థానం,అండర్ 14 ఖో-ఖో పోటీలలో ద్వితీయ స్థానం సాధించి జోనల్ స్థాయికి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ తెలిపారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు,ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## మృతుల కుటుంబాలకు 2 క్వింటాల బియ్యం అందజేత



**స్టేషన్ ఘన్పూర్/అక్టోబర్16 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని పాంనూర్ గ్రామానికిచెందిన కోట వాసు ఇటీవల విద్యుత్ షాక్ తగిలి ఇటీవల మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న హనుమాన్ భక్తుల బృందం గురువారం రోజున మృతుని కుటుంబాన్ని పరామర్శించి, వారికి సహాయంగా ఒక క్వింటాను బియ్యం ఇవ్వడం జరిగింది. అదేవిదంగా కేశోజు లచ్చమ్మ ఆనారోగ్యంతో మృతి చెందగా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఒక క్వింటాల్ బియ్యం ఇవ్వడం జరిగింది.ఈకార్యక్రమంలో ఇనుగాల సంపత్ రెడ్డి, వంగ శ్రీనివాస్,దొంతూరి రవి ,తాళ్ళపెల్లి కిషోర్, ఇనుగాల రాజిరెడ్డి,డాక్టర్ కరుణాకర్ రెడ్డి,పొన్న రాజు, తాళ్ళపెల్లి లింగమూర్తి, బత్తిని రాజు, చెరుకు స్వామి, కోట మల్లయ్య,తాళ్ళపెల్లి రాంబాబు,ఇనుగాల రవీంద ర్ రెడ్డి , జాలిగపు నాగరాజు, పొన్న ఎల్లయ్య, కంచర్ల మనోహర్, బత్తిని సాయిబాబా,బత్తిని నాగేష్ ,సుంక (మీస) శంకర్, తాళ్ళపెల్లి త్రిశూల్ ,కనుకటి బాబు, మునిగాల శ్రీను, పాల సంపత్ రెడ్డి తదితరులు పాల్గొ న్నారు.

# ఆలయ అభివృద్ధికి నగదు అందజేత




**గణపురం/అక్టోబర్16 (జర్నలిస్ట్ వార్త):** గణపురం మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన సీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రతిష్టాపన మహోత్సవ తేదీలను తెలిపారు వచ్చేనెల నవంబర్ తేదీలో 13 14 15 16 జరగనున్న ప్రతిష్టాపన మహోత్సవం ప్రఖ్యాతిగాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో రాబోయే కార్తీక మాసంలో జరగనున్న గణపతి శివలింగ నవగ్రహ అష్ట బలిపీఠ ప్రతిష్టాపన కొరకు తమ వంతుగా గణపురం మండల కేంద్రానికి చెందిన మాదాసు సురేష్ దంపతులు 5000 రూ ఆలయ కమిటీ చైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కి రూ నగదుగా ఇవ్వడం జరిగింది ఇందులో భాగంగా ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు ఇవ్వడం జరిగింది ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్ మూలా శ్రీనివాస్ గౌడ్ భటిక స్వామి బూర రాజగోపాల్ గౌడ్ మాదాసు మొగిలి గౌడ్ మాదాసు అర్జున గౌడు ఉయ్యాల బిక్షపతి గౌడ్ దయ్యాలభద్రయ్య పాండవుల భద్రయ్య మోటపోతుల రాజన్న గౌడ్ గోరంటల రాజన్న గుప్త పాల్గొన్నారు.

# ఘనంగా పోషణ మాస ముగింపు మహోత్సవాలు



**స్టేషన్ ఘన్ పూర్/అక్టోబర్16 (జర్నలిస్ట్ వార్త) :** స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని 6వ అంగన్వాడి సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాస మహో త్సవాలు ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించా రు.అంగన్వాడి సెంటర్ల ఆధ్వర్యంలో పోషణ మాసోత్స వాల్లోభాగంగా ఆరోగ్యకరమైన వంటకాలపైసమావేశం నిర్వహించి, పౌష్టికా అనుబంధ ఆహారాల వంటకాల పోటీలు నిర్వహించారు. చిరుధాన్యాల పై, పౌష్టికాహార పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించడం జరి గింది. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ మునిగాల రాణి మాట్లాడుతూ చిరుధాన్యాలు రోజు తినాలని, అందుబాటులో దొరికే ఆకుకూరలు, తాజా కూరగాయ లు తినాలనిఅన్నారు.జింక్ ఫుడ్ పై అవగాహన,అధిక బరువు పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంధ ఆహారం మొదలు పెట్టడం,అందుబాటులోదొరికే ఆహారపదార్థా లు,మొలకెత్తిన విత్తనాలు తినాలనిఅన్నారు.ఈ కార్య క్రమంలో అంగన్వాడి టీచర్ మునిగాల రాణి, గోనెల రాజయ్య, మునిగల సంపత్, గర్భిణీలు, తల్లులు, యువత, చిన్నారులు తదితరులుపాల్గొన్నారు. మండ లంలోని తాటికొండ గ్రామ పంచాయతీ పరిధిలోని జిబి తండ అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి టీచర్ భూక్య లలిత ఆధ్వర్యంలో పోషణ మాస ముగింపు ఉత్సవా లు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా అంగన్వా డి పిల్లలకు అన్నప్రాసన చేయించి, అంగన్వాడి కేంద్రా ల్లో గర్భిణీలు పాలిచ్చేతల్లులతో,శిశువులు,చిన్నపిల్లల పోషణ పై సలహా సమావేశాలు నిర్వహించారు. చిరు ధాన్యాల పై, పౌష్టికాహార పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ లలిత మాట్లాడుతూ పౌష్టికాహారం తోనే గర్భిణీ లు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్య సమసమాజం రూపుదిద్దుకుంటుందని అన్నా రు. పోషణ మహోత్సవాల్లో ప్రతిఇంటిని సందర్శించి పోషణలోపంఉన్న గర్భిణీలను, తల్లులను, చిన్నారుల ను గుర్తించి ఆరోగ్య వంతులుగా చేయడం ఈ కార్యక్ర మ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నా రు. పోషణ మాస ఉత్సవాల సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.ఈ సమావేశంలో అంగన్వాడి టీచర్లు, గర్భిణీ లు,బాలింతలు,చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు పౌష్టికారం తీసుకోవాలి

**కొత్తపెల్లి లో ఘనంగా అన్నప్రాసన కార్యక్రమం**




**స్టేషన్ ఘన్పూర్/అక్టోబర్ 16 (జర్నలిస్ట్ వార్త) :** మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో గల 1 వ, 2 వ, అంగన్వాడి సెంటర్ల ఆధ్వర్యంలో గురువారం పోషణ మాస మహోత్సవాల ముగింపు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడి సెంటర్ల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవా ల్లో భాగంగా అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీ లు పాలిచ్చే తల్లులతో, శిశువులు,చిన్న పిల్లల పోషణ పై సలహా సమావేశాలు నిర్వహించారు. చిరు ధాన్యాల పై, పౌష్టి కాహార పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించ డం జరిగింది. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్లు ఆర్ రజిత, ఎన్ రేణుక మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే గర్భిణీలు, బాలింతలు,చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యం గా ఉంటారని సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్య సమసమాజం రూపుదిద్దుకుంటుందని అన్నారు. పోష ణ మహోత్సవాల్లో ప్రతి ఇంటిని సందర్శించి పోషణ లోపం ఉన్న గర్భిణీలను, తల్లులను,చిన్నారులను గుర్తించి ఆరోగ్య వంతులుగా చేయడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిర క్షణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పౌష్టిక ఆహారం, చిరుధాన్యాలు, ఆకు కూరలు, మొల కెత్తిన గింజలు తినాలని అన్నారు. ప్రతి ఒక్కరూ పౌష్టి కాహారం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. పోష ణ మాస ఉత్సవాల సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో అంగన్వాడి టీచర్లు రజిత,రేణుక, తల్లు లు మారబోయిన స్వాతి, సింగపురం అమృత, ప్రాథ మిక పాఠశాల ఉపాధ్యాయులు, గర్భిణీలు, తల్లులు, ఆశా కార్యకర్తలు, కిషోరబాలికలు,చిన్నారులు తదిత రులు పాల్గొన్నారు.

# బీసీ సమ్మెకు బీజేపీ మద్దతు..

**రిజర్వేషన్లలో శాస్త్రీయత ఉంటే తోడుగా ఉంటామంటూ వెల్లడి..**



**సత్తుపల్లి/అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** ఈనెల 18న బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని ఆ పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు తెలిపారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ అమలులో శాస్త్రీయత ఉంటే ఆఖరి వరకు తోడుగా ఉంటామని పేర్కొన్నారు. ఎలాంటి శాస్త్రీయత లేని ప్రకటనలతో బీసీలను మోసం చేసే దిశగా కాంగ్రెస్ కపట నాటకం ఆడుతుందని ఆరోపించారు. మొదటి నుంచి బీసీలకు బీజేపీలో అగ్ర తాంబూలం లభిస్తుందన్నారు. కేంద్ర క్యాబినెట్ మొదలు పార్టీ పదవుల్లోనూ బీసీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చిన పార్టీ దేశంలో బీజేపీ ఒక్కటే అనే విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కావాలని ఉద్దేశపూర్వకంగా ఈ అంశాన్ని బీజేపీపైకి నెడుతున్నాయన్నారు.ఆ విషయాన్ని ఇప్పటికైనా బీసీలు గ్రహించాలని కోరారు.. రిజర్వేషన్ల అంశం షెడ్యూల్లో చేర్చితేనే అమల్లోకి వస్తుందనే విషయం ముఖ్యమంత్రికి తెలియకుండానే ఎన్నికల్లో హామీ ఇచ్చి.. మేనిఫెస్టోలో పెట్టారా అని ప్రశ్నించారు.. షెడ్యూల్లో పొందుపరచకుండా అమలు కాదనే విషయం తెలిసీ కూడా బీసీల ఎదుట కాంగ్రెస్ డ్రామా ప్లే చేస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ మాదిరి కాకుండా శాస్త్రీయబద్ధమైన రిజర్వేషన్ల కోసం రాష్ట్ర బీజేపీ నాయకత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతుందన్నారు. అశాస్త్రీయ పద్ధతిలో ప్రకటనలు చేసి కోర్టుల ఎదుట బీజేపీ దోషిగా నిలబడదని స్పష్టం చేశారు.రేపు జరిగే బీసీ బంద్ కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ మరియు రూరల్ మండల అధ్యక్షులు బానోత్ విజయ్, శాలి శివకృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జొన్నలగడ్డ నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, జిల్లా కార్యదర్శి సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డపనేని కృష్ణయ్య, గొర్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, పరస రాంబాబు, పడిగల మధుసూదన్ రావు, శివ యాదవ్, శేషగిరిరావు, కార్తీక్ యాదవ్, నాని, లక్ష్మీనారాయణ, రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలో పోతురాజు చూపిన ప్రతిభ ప్రశంసనీయం

**-పోతురాజు రచన 'నాన్నే నాహీరో'పుస్తకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్**



**సత్తుపల్లి/అక్టోబర్16(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతూ విద్యార్ధి దశలోనే అద్భుతమైన కథలు రాసి ఆవుల పోతురాజు నేటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాడని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు.గురువారం సత్తుపల్లిలో గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ ప్రచురించిన పోతురాజు బాల సాహిత్య రచన 'నాన్నే నాహీరో'పుస్తకాన్ని ఎమ్మెల్యే దంపతులు రాగమయి దయానంద్ ఆవిష్కరించారు.పిల్లల లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించినట్లయితే పోతురాజు వంటి ఆణిముత్యాలు సమాజానికి అందుతారని ఆమె పేర్కొన్నారు.పేదరికం సృజనాత్మక శక్తికి అడ్డు కాదని,గుడారంలో నివసించినా తన రచనా ప్రతిభను సమాజం గుర్తించేలా పోతురాజు కృషిచేసాడని అభినందించారు.ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని తెలిపారు.పోతురాజును తల్లి తిరుపతమ్మను, పోతురాజును ప్రోత్సహించిన తెలుగు ఉపాధ్యాయిని ఎం.రమాదేవి,ఎన్.సి.హెచ్. వెంకటాచార్యులు దంపతులను,ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోందు షేక్,ప్రచురణ చేసిన గార్లపాటి-బొల్లేపల్లి ట్రస్ట్ నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన రాజు లను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆషా డైరక్టర్ రామిశెట్టి శ్రీనివాసరావు,పసుపులేటి నాగేశ్వరరావు,మహమ్మద్ షాకీర్ హుస్సేన్, గోలి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను మరోసారి

# మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ

**రేవంత్ సర్కార్ ఇచ్చిన జీవో 9 ను కొట్టేసిన సుప్రీంకోర్టు -కాంగ్రెస్ పార్టీకి బీసీల పైన ఉన్నది కపట ప్రేమ మాత్రమే**

**పెద్ది సుదర్శన్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే**



**నర్సంపేట/అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** బీసీలను మరోసారి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. గురువారం రేవంత్ సర్కార్ ఇచ్చిన జీవో 9 ను సుప్రీంకోర్టు కొట్టేసిందని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీకి బీసీల పైన ఉన్నది కపట ప్రేమ మాత్రమే అని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నేడు ఆ హామీని నిలబెట్టుకోలేక బీసీలను మోసం చేస్తుందన్నారు.బీసీ లకు రాజకీయ, విద్య, ఉద్యోగ అవకాశాలలో 42 శాతం రిజర్వేషన్ అమలుపైన కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, రేవంత్ సర్కార్ కపట ప్రేమను బీసీల పైన చూపిస్తూ 42 శాతం రిజర్వేషన్ అందకుండా రాజ్యాంగ విరుద్ధంగా జీవోలను ,ఆర్డినెన్స్ లను, చట్టాలను చేస్తూ బీసీలను నయవంచనకు గురిచేస్తుందన్నారు. హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 9 పైన స్టే విధించినది ,ఈ జీవో సుప్రీంకోర్టులో చెల్లదని తెలిసి కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించడం కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేయడమేనని చెప్పారు. బీహార్ రాష్ట్రంలో జరిగే ఎన్నికల కోసం హైకోర్టు,సుప్రీం కోర్టులలో చెల్లని జీవోలను తీసుకువచ్చి రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని తెలంగాణ బీసీ సమాజం గమనిస్తున్నదన్నారు. దేశంలో ప్రధాన ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న రాహుల్ గాంధీ ,కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో బిసి రిజర్వేషన్ చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయడం లేదు, ఒక్క రోజుకూడా పార్లమెంటును స్తంభింప చేయలేదు. రాష్ట్రంలో మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం హడావుడి చేస్తున్నట్లు నటిస్తున్నా కాంగ్రెస్
రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న రెండు జాతీయ పార్టీలు కాంగ్రెస్ మరియు బీజేపీ కుట్రల వలనే నేడు బీసీలకు రిజర్వేషన్ ఫలాలు అందడం లేదు.కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేస్తున్న మోసాన్ని ఎండగడుతూ ఈనెల 18న బీసీ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన బంద్ కు బిఆర్ఎస్ పార్టీ మద్దతు తెలియజేస్తున్నది.నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఈ బంద్ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొని 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ పార్టీ పైన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

# జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటిన రాయపర్తి గురుకుల విద్యార్థినీలు



**రాయపర్తి/అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** 69వ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి ఖో ఖో క్రీడా పోటీలలో రాయపర్తి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ సరిత అభినందనలు తెలియజేశారు.అండర్ 14 విభాగంలో ఏడవ తరగతి చదువుతున్న లాస్య నందిని, శ్రీమాన్య, సలోమి, లాస్య, లక్ష్మీ ప్రసన్న విద్యార్థినిలు ఈ క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ మెమెంటో అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి అండగా శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి/అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మైలారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గబ్బేట సోమమల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా గురువారం బాధిత కుటుంబాన్ని ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్,బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరు పాటి శ్రీనివాస్ రెడ్డి పరామర్శించి 50 కేజీ ల బియ్యం ఆయిల్ క్యాన్ ను అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,గ్రామ పార్టీ అధ్యక్షులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి,లేతకుల రంగా రెడ్డి,గబ్బేట కొమురయ్య, గబ్బేట యాకయ్య, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, గాడిపెల్లి రాములు, చిర్ర బిక్షపతి, చిర్ర దర్గయ్య, గబ్బేట యాకయ్య, గాడిపెల్లి రాజు, జిల్లా సారయ్య, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖల

# అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చెయ్యాలి

**-భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**




**భూపాల్ పల్లి /అక్టోబర్16 (జర్నలిస్ట్ వార్త):** జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చెయ్యాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన బుగులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం జాతర, బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీస్, సింగరేణి, వైద్య, ఆర్టీసీ, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో నవంబర్ 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు జరిగే శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతరకు వేలాదిమంది భక్తులు తరలివస్తారని, అందువల్ల అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా తాత్కాలిక మరమ్మతులు, రహదారి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. భక్తులు గుట్టపైకి ఎక్కడానికి అనువుగా ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పరకాల, భూపాలపల్లి మరియు ఇతర డిపోల నుండి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అత్యవసర వైద్య కేంద్రాలు, 108 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. భక్తులకు సురక్షిత త్రాగునీరు అందించేందుకు ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతర సమయంలో భక్తుల రద్దీ నియంత్రణకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని, అలాగే అటవీ శాఖ తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జాతర నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారిగా చేపట్టాల్సిన పనులపై అంచనా నివేదికలు ఇవ్వాలని సూచించారు. సిసి కెమెరాల ద్వారా బందోబస్తు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలోఎస్పీ కిరణ్ ఖరే, అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, ఆర్టీసీ డిఎం ఇందు, డివిజనల్ పంచాయతి అధికారి మల్లికార్జున్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ రమణా రెడ్డి, దేవస్థానం ఈఓ బిల్ల శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మంబ్యూరో/అక్టోబర్16 (జర్నలిస్ట్ వార్త):** రూరల్ మండలంలోని ఆరెకోడు గ్రామానికి చెందిన అబ్బోజు నరేష్ కుమార్తె భావన ప్రియ ఓణీల అలంకరణ, కుమారుడు ఉదయ్ తరుణ్ పంచకట్టు వేడుక మారెమ్మ దేవస్థానం వద్ద గురువారం జరగగా.ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, నాయకులు మొగిలిచర్ల సైదులు, విప్లవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి సంతోష్ కుటుంబానికి

# స్నేహితుల ఆర్థిక సహాయం...





**వర్ధన్నపేట/అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం లోని నల్లబెల్లి గ్రామానికి చెందిన మల్యాల సంతోష్ కుమార్ అనారోగ్యం తో మృతి చెందాగా గురువారం దశ దిన కర్మ నిర్వహించగా 2001-2002 టెన్త్ క్లాస్ మెంట్స్అందరూ 30,000 రూపాయలు వాళ్ల పిల్లల పేరు మీద పోస్ట్ ఆఫీస్ లో పిక్స్ చేసి, జమ చేసిన బాండ్ పేపర్ వాళ్ల కుటుంబ సభ్యులకు అందేశారు. ఈ కార్యక్రమంల్లోపసుల మహేందర్ కీర్తి రాందాస్ గుంటి అనిల్ కుమార్ ఇలబోయిన రమేష్ తూళ్ళ తిరుపతి రాసూరిదేవన్న దాడి రాజు దుగ్యాల భీమ్ శంకర్ సుల్తాన్ వెంకన్న, గొల్లవెల్లి దయాకర్, రాచమల్ల స్వాతి,మరిపట్ల వెంకటేశ్వర్లు, ఎలబోయిన రమేష్,తాల్లపెల్లి, పూర్ణ చందర్, గుంటి అనిల్ కుమార్, పాము ప్రకాష్, నీలిమా, మురళీకృష్ణ, రాజు, జాన్సీ, సుమన్,కృష్ణ, రాజేష్, మల్యాల తనూజ, రాజు బిక్షపతి, మల్యాల నాగలక్ష్మి, భీమ్ శంకర్, శ్రీనివాస్, రాజు,రవి, రాజ్ కుమార్, తదితరులు ఉన్నారు.

# మెరుగైన సేవలతో ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం కలిగించాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**వైద్య పరీక్షలకు బయటకు పంపితే కఠిన చర్యలు**

**ఓపి కేసుల్లో కనీసం 60 శాతం వైద్య పరీక్షలు నిర్వహించాలి**

**తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల పనితీరుపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం బ్యూరో/అక్టోబర్16(జర్నలిస్ట్ వార్త):** మెరుగైన సేవలతో ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల పనితీరుపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు బాగా పనిచేస్తే హయ్యర్ రెఫరల్ ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గడమే కాకుండా ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజలకు నమ్మకం కలుగుతుందని అన్నారు. జిల్లాలో ఉన్న 7 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందని అన్నారు.వైద్య విధానం పరిషత్ ఆసుపత్రులలో ప్రసవాలు జూలైలో 47 నుంచి సెప్టెంబర్ 74 కు చేరాయని, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి ఆసుపత్రిలో మంచి ఫలితాలు రాగా, కల్లూరు, వైరా, సత్తుపల్లి , పెనుబల్లి, మధిర ఆసుపత్రులలో ఆశించిన పురోగతి లేదని కలెక్టర్ అన్నారు. 10 మంది గైనకాలజిస్ట్ స్టాఫ్ ఉన్నప్పటికీ కేవలం 74 ప్రసవాలు మాత్రమే జరగడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ నమోదు కూడా మన దగ్గర తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు. వైద్య విధాన పరిషత్ సంబంధించి దయాగ్నోస్టిక్ హబ్ కు పంపే పరీక్షల శాంపిల్స్ చాలా తక్కువగా నమోదు కావడానికి గల కారణాలు కలెక్టర్ ఆరా తీశారు. టి.వి.వి.పి. ఆసుపత్రిలో 5 వేలకు పైగా ఔట్ పేషెంట్ ల సంఖ్య ఉన్నప్పటికీ వైద్య పరీక్షలు 1400 కూడా చేసుకోలేక పోవడం ఏంటని కలెక్టర్ ప్రశ్నించారు. ఓపి కేసుల్లో కనీసం 60 శాతం వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. వైద్య పరీక్షలకు బయటకు పంపుతున్నారు అనే మాట ప్రజలలో బాగా వినిపిస్తుందని, ఇటువంటి అంశాలను తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వైద్య విధాన పరిషత్ సంబంధించి ప్రతి రిపోర్ట్ ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు అవసరమైన ఎక్స్ రే, ఈసిజి యంత్రాలపై ప్రతిపాదనలు అందించాలని, వారం రోజులలో సిబిపి యంత్రాల డెలివరీ పూర్తి కావాలని అన్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్న స్పెషలిస్ట్ డాక్టర్లు ద్వారా అవసరమైన రోగులకు సర్జరీలు ప్రభుత్వ ఆసుపత్రులలో నిర్వహించాలని అన్నారు. రాబోయే మూడు నెలల కాలంలో వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో మోకాల మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించేలా కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. మేజర్ శస్త్ర చికిత్స లకు అవసరమైన పరికరాలను ఎం.ఐ.డి.సి. ఉన్నతాధికారులతో చర్చించి ప్రాధాన్యత క్రమంలో జిల్లాకు తెప్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కంటి శస్త్ర చికిత్సల నిర్వహణకు స్పెషల్ ఓటి నిర్మాణం తిరుమలాయపాలెంలో చేసేలా ప్రతిపాదనలు అందిస్తే రెవెన్యూ మంత్రితో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని అన్నారు. మన ఆసుపత్రి నుంచి చేసిన రిఫరెన్స్ ఫాలో అప్ చేయాలని అన్నారు. మన దగ్గర నుంచి ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేయడానికి వీలులేదని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ ఉన్న ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, పాలేరు నియోజకవర్గం ప్రత్యేక అధికారి రమేష్, సూపరింటెండెంట్లు, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పదవికి దరఖాస్తులు స్వీకరణ



**వైరా/అక్టోబర్16(జర్నలిస్ట్ వార్త):** నియోజకవర్గ కేంద్రంలో ఏఐసీసీ సంఘటన్ సృజన్ అభియాన్ లో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుని ఎన్నిక అభిప్రాయ సమావేశం.ఆశావాహుల నుండి దరఖాస్తులు స్వీకరించిన ఏఐసీసీ అబ్జర్వర్‌హాజరైన ఏఐసిసి అబ్జర్వర్ మహేంద్రన్ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువాళ్ళ దుర్గాప్రసాద్, నియోజకవర్గ ఇన్చార్జ్ రవళి రెడ్డి , సమావేశానికిహాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు. పాల్గొన్నారు

## ప్రభుత్వ హాస్పిటల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి...

**వర్ధన్నపేట/అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):**

ప్రభుత్వ హాస్పిటల్స్ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి దంత వైద్యులు డాక్టర్ భరత్ రెడ్డి అన్నారు. గురువారం నిరుపేద కుటుంబానికి చెందిన ఎం రజిత వీల్ చేతికే పరిమితమై ఉండగా తన నోటిలోని పండ్లు మొత్తం పుచ్చిపోయిన పరిస్థితి నెలకొంది అన్నారు. వెంటనే వైద్య అధికారి స్పందించి వైద్యం అందించడం జరిగిందన్నారు ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి సరిపడా మందులు అందించడం జరిగిందని తెలిపారు ఈ సందర్భంగా వారి వెంట వైద్యులు అపర్ణ, హరీష్ తదితరులు ఉన్నారు.




## రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ మరియు
# విద్యార్థులకు వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

**అక్టోబర్ 21 నుండి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు**

**పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలలో విద్యార్థులకు ఆన్లైన్ లో వ్యాసరచన పోటీల నిర్వహణ**

**-పోలీస్ అధికారి కిరణ్ ఖరే, ఐపీఎస్**

**భూపాలపల్లి /అక్టోబర్16(జర్నలిస్ట్ వార్త)**
అక్టోబరు 21 నుండి 24వ తేది వరకు పోలీస్ స్టేషన్ లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి, పోలీసు విధులు, పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం, షిటీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, ఆంటీ నార్కోటిక్ డ్రగ్, డాగ్ స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణ లో పోలీసుల సేవలు, పోలీసులు చేసిన ప్రతిభ, త్యాగాలు మొదలగునవి విషయాలను ప్రజలకు, విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుందని పోలీస్ అధికారి కిరణ్ ఖరే, ఐపీఎస్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ

1 కింద ఇవ్వబడిన లింక్‌పై క్లిక్ చేసి పాల్గొనండి: https://forms.gle/jaWLdt2yhNrMpe3eA

2 మీ పేరు, విద్యార్హత మరియు ఇతర వివరాలు నమోదు చేయండి.

3 వ్యాసాన్ని పేపర్‌పై రాసి, దానిని చిత్రం ఫార్మాట్‌లో 500 పదాలు మించకూడదు అప్‌లోడ్ చేసి సబ్మిట్ చేయండి.

వ్యాసరచన అంశం డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు ఆన్లైన్ లో %ట్ట్రజూం://టశీతీఎం.స్ర్తీవ/ఝఔూన్2ఎష్ట్రచీతీవీజూవ3 వూ% ఈ వెబ్సైట్ ద్వారా వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరుగుతుంది. వ్యాసరచన పోటీలు మూడు భాషల్లో అనగా తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో అభ్యర్థులు పాల్గొనవచ్చును. "ఆన్లైన్ నందు వ్యాసరచన పోటీలు నిర్వర్తించడం జరుగుతుంది. ఆన్లైన్లో 28 అక్టోబర్ 2025 వరకు సమర్పించవచ్చును. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు అభ్యర్థులను జిల్లా పోలీస్ కార్యాలయంలో బహుమతుల ప్రధానం చేసి, తదుపరి ఈ ముగ్గురు అభ్యర్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రస్థాయిలో, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు సంపాదించాలని అన్నారు. రక్తదాన శిబిరాల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. పోలీస్ అమరవీరుల స్మరిస్తూ పోలీస్ వారి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించబడుతుంది అని తెలిపారు.షార్ట్ ఫిలిమ్స్, ఫోటోగ్రఫీ పోటీలు విద్యార్థిని, విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు, వీడియో గ్రాఫర్లకు, పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫోటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసుల సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గించకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని, ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫోటోలను, వీడియోలను జిల్లా స్థాయిలో బహుమతి ప్రధానం చేస్తూ, రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి రాష్ట్ర పోటీల్లో పాల్గొనే విధంగా అర్హత లభిస్తుందని తెలియజేశారు. ఫోటోలు, వీడియోలు ఈనెల తేదీ: 23-10-25 లోపు ఫోటోల పెన్ డ్రైవ్ నందు వేసిన షార్ట్ ఫిలిం ను పోలీస్ కార్యాలయంలో పి ఆర్ ఓ(8712658164) కు అందించాలని తెలియజేశారు. ఈ నెల 21వ తేదీ నుండి 31వ తేదీ వరకు పబ్లిక్ స్థలాల్లో పోలీస్ అమరవీరుల గురించి తెలుపుతూ పోలీస్ కళా బృందంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిదిలోని ప్రధాన కూడళ్ళ వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందనీ కమిషనర్ తెలిపారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాల స్మరణలో భాగంగా అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం "పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా సంస్మరణ కార్యక్రమాలను అక్టోబర్ 21వ తేది నుండి అక్టోబర్ 31వ తేది వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని,
ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, యువకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పీ తెలియజేశారు.




# విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రణాళిక

## టిజిఎన్పిడిసిఎల్ డిఈ ఎలిశెట్టి రాంబాబు

**స్టేషన్ ఘన్పూర్/అక్టోబర్16 (జర్నలిస్ట్ వార్త) :**
విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని అందుకు సిబ్బందిని అప్రమత్తం చేశామని టిజిఎన్పిడిసిఎల్ డిఈ ఆపరేషన్ ఘన్ పూర్ ఎలిశెట్టి రాంబాబు అన్నారు. స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో ఘనపూర్ టౌన్ , శివునిపల్లి సెక్షన్ల విద్యుత్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించిన డిఈ ఆపరేషన్ ఘనపూర్ టిజిఎన్పి డిసిఎల్ ఎలిశెట్టి రాంబాబు మాట్లాడుతూ సిబ్బంది ద్వారా డివిజన్ పరిధిలోని కొన్ని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని సంబంధిత గుత్తేదార్ల ద్వారా అట్టి ప్రాంతాల్లో విద్యుత్ పనులను మొదలు పెట్టి అతిత్వర లో సరఫరాలో సమస్యలను శాశ్వతంగా నివారించడమే కాకుండా భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.డివిజన్ పరిధిలో ప్రమాదరహిత నిరంతరాయ విద్యు త్ సరఫరా అందించాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తు న్నామని మునిసిపల్ పట్టణ పరిధిలో పనులు చివరి దశలో ఉన్నాయని మిగతా ప్రాంతాల్లో పనులు మొద లు బెట్టామని తెలిపారు. కొన్ని సబ్ స్టేషన్లలో తక్కువ సామర్థ్యం కలిగిన పిటిఆర్ లకు అనుసంధానంగా ఎక్కువ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్ఫార్మర్లను భిగించి లోఓల్టేజ్ తోపాటుఓవర్లోడ్ సమస్యలు పరిష్క రించామని,11కేవి లైన్లో అంతరాయాల తక్షణ పరిష్కా రంకోసం లైన్ ఏబీస్విచ్ లను ఏర్పాటు చేస్తున్నామని, వదులుగా ఉన్న తీగలను గుర్తించి మధ్య స్థంభాలను నాటించడమే కాకుండా,తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ల గద్దెల ఎత్తును పెంచే పనులు జరుగుతు న్నాయని, పురాతన ఫ్యూస్ సెట్ల స్థానంలో నూతన సామాగ్రి భిగించి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అవసరాన్ని బట్టి పురాతన కేబుల్ వైర్లస్థానంలో నూతన కండక్టర్ వైర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు భద్రతా నియమాలుపాటించాలని సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా సొంత రిపేర్లకు దూరంగాఉండాలన్నా రు. బకాయిలు లేకుండా విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏడిఈ పి రణధీర్ రెడ్డి, ఏఈలు పి శంకర్, శివ కుమార్,సబ్ ఇంజనీర్ పి సాధన, బి హరిత, ఫోర్మెన్ ఎడ్ల రాజేందర్, పెద్దిరెడ్డి, కాల్రామ్, వాసం శ్రీధర్, గబ్బెట సుధాకర్,అల్లం సదన్, అన్వర్ పాషా,నాగరాజు,కుంబం రాము, అల్లావుల రాము,అశోక్,గుర్రం రాజు,సురేష్ తదితరులు పాల్గొన్నారు. విజయవంతంగా సంవత్సరకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా డిఈ గారిని విద్యుత్ ఉద్యోగులు షాలువాతో ఘనంగా సన్మానించారు.



## రేవంత్ పాలనలో పెరిగిన వలసలు


హైదరాబాద్,**అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** రేవంత్‌రెడ్డి 22నెలల పాలనలో అనూహ్యంగా వలసలు పెరిగాయని మాజీ మంత్రి తన్నీరు హరీషరావు ఆరోపించారు. గల్ఫ్‌లోని జోర్డాన్‌లో చిక్కుకుని స్వగ్రామాలకు తిరిగిరాలేక ఆవేదన చెందుతున్న 12మంది తెలంగాణ కార్మికులకు బీఆర్ఎస్ అండగా నిలిచిందన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ద్వారా ప్రయత్నించి కార్మికులను రాష్ట్రానికి తీసుకువస్తున్నట్లు చెప్పారు. జోర్డాన్ బాధిత కార్మికుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వారికోసం జరిపే చెల్లింపులతోపాటు స్వదేశానికి వచ్చేందుకయ్యే విమానటికెట్ల ఖర్చును కూడా తామే భరిస్తున్నట్లు హరీశ్‌రావు చెప్పారు. వారం రోజుల్లో నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేటకు చెందిన 12మంది గల్ఫ్ కార్మికులు తెలంగాణకు చేరుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేసినట్లుగానే, గల్ఫ్ కార్మికులను కూడా కాంగ్రెస్ మోసం చేసిందని, అభయహస్తం మేనిఫెస్టోలో చెప్పిన గల్ఫ్ కార్మికులు, ఎన్నారైల సంక్షేమబోర్డుపై ఇప్పటికీ అతీగతీలేదని ఆరోపించారు.



# ధాన్యం రైతులను ఇబ్బంది పెట్టవద్దు

## ఐకెపి కేంద్ర సిబ్బందికి కడియం హెచ్చరిక

జనగామ**అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):** రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే రైతులను.. కేంద్ర నిర్వాహకులు ఇబ్బంది పెడితే సహించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో వారికి సహాయంగా ఉండి తగిన విధంగా చేయూత ఇవ్వాలన్నారు. నమిలిగొండలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కడియం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్య ఉన్నా రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం- రైతు ప్రభుత్వమని దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ ఏడాది నుంచి ధాన్యం డబ్బులతో పాటు బోనస్ కూడా అందించడానికి ప్రభుత్వం అద్భుతమైన నిర్ణయం తీసుకుందని కొనియాడారు. ధాన్యం కొనుగోలు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రైతులకు మద్దతు ధరలు ఇవ్వడం, పూర్తి ధాన్యం కొనడం ప్రభుత్వ బాధ్యతని అన్నారు.



# మైనర్లతో అసభ్య కంటెంట్ చేస్తే కేసులే

## యూట్యూబర్లకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరిక -వెంటనే వీడియోలు తొలగించిన పలు యూట్యూబ్ చానెళ్లు

హైదరాబాద్**అక్టోబర్ 16(జర్నలిస్ట్ వార్త):**
: వ్యూస్, లైక్‌ల కోసం మైనర్లతో అసభ్యకర వీడియోలు తీసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మేరకు పలు క్లిప్పుంగులతో గురువారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. వ్యూస్, లైక్‌ల మాయలో పడి విలువలు మరిచిపోతే ఎలా ? అంటూ ప్రశ్నించారు. మీరు ప్రాచుర్యం పొందేందుకు చిన్నారుల భవిష్యత్తును పణంగా పెట్టడం ఏంటని, అలాంటి వీడియోలతో సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూల పేరిట మైనర్లతో అసభ్యకర కంటెంట్ రూపొందించి సోషల్ మీడియాలో పోస్టు చేయడం బాలల హక్కుల ఉల్లంఘన అని, జువైనల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం నేరమని తెలిపారు. ఈ తరహా కంటెంట్ చేసేవారి పట్ల కఠినంగా ఉంటామని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తక్షణమే ఆ వీడియోలు తొలగించకపోయినా, భవిష్యత్తులో అలాంటి కంటెంట్ మళ్లీ అప్‌లోడ్ చేసినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోల గురించి పోలీసుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను కూడా కోరారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కాగా, సీపీ సజ్జనార్ ఎక్స్‌లో చేసిన పోస్టుతో అప్రమత్తమైన పలు యూట్యూబ్ చానెళ్ల నిర్వాహకులు.. తమ చానెళ్లు, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల నుంచి అభ్యంతరకర వీడియోలు, రీల్స్‌ను వెంటనే తొలగించారు.

